

త్రిపుర గవర్నర్‌ను సన్మానిస్తున్న జాతీయ ఉద్యానవన బోర్డు డైరెక్టర్ వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు

ఎంచుకున్న రంగంలో అభివృద్ధి సాధించాలి

వనస్థలిపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి వనస్థలిపురంలోని జాతీయ ఉద్యానవన బోర్డు డైరెక్టర్ వనపల్లి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో గతంలో తనతో పాటు బీజేపీలో పనిచేసిన నాయకులు, కార్యకర్తలను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వనపల్లి శ్రీనివాస్ రెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహారం, తేనేటి విందులో గవర్నర్ పాల్గొని పాత బీజేపీ నాయకులు, కార్యకర్తల బాగోగులను తెలుసుకుని వారితో ఉల్లాసంగా గడిపారు. గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తాము ఎంచుకున్న రంగంలో అభివృద్ధిని సాధించి సమాజానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయాలపై ఫిర్యాదు చేయాల్సిన ఫోన్‌నెంబర్లు

సైదాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌సీపీడీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడితే ఈ కింది నెంబర్లకు ఫోన్‌లో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది.

ప్రాంతం	ఎఫ్ఓసీ	ఏఈ
ఆస్మాన్‌ఘడ్	9490619823	9440812950,
మూసారాంబాగ్	9490619815	9440812949
సైదాబాద్	8985515996	9440812951
చంచల్‌గూడ	9490619827	9440812958
నూర్‌ఖాన్ బజార్	9490619814	9440812957
మాదన్నపేట	9490619820	9440812954
సంతోష్‌నగర్	9490619819	9440812952
భవానీనగర్	9490619821	9440812955

ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని ప్రాంతాలలో వచ్చే ఫిర్యాదులకు సంబంధిత సిబ్బంది, ఏఈలు స్పందించకపోతే నేరుగా ఆస్మాన్‌ఘడ్ డీఈ 9440812963, ఆస్మాన్‌ఘడ్ ఏడీఈ 9440812926, చంచల్‌గూడ ఏడీఈ 9440812927, సంతోష్ నగనర్ ఏడీఈ 9440812928లకు ఫిర్యాదు చేయవచ్చు.

ఎప్పుడు కూలుతుందో..

- గుర్రంగూడ ఆదిత్యానగర్‌లో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం



పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ ఆదిత్యానగర్‌కాలనీ ప్రధాన రోడ్డులో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థానికులకు ముప్పు పొంచి ఉంది. ఇక్కడ ఓ విద్యుత్ స్తంభం ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. అది ఎప్పుడు కూలిపోతుందో.. ఎవరికి మూడుతుందో.. అనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై తాము సంబంధిత ట్రాన్స్‌కో అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆదిత్యానగర్ కాలనీ అధ్యక్షుడు పుట్టగల్ల రవీందర్ ఆరోపించారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చెరువులకు మరమ్మతులు చేయించండి



ఇరిగేషన్ డీఈఈకి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ శ్రీలత అనిల్‌కుమార్

హయత్‌నగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెగిపోయిన చెరువు, కుంట కట్టలకు మరమ్మతులు చేయించాలని కోరుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటి ఉమర్‌ఖాన్ గూడ కౌన్సిలర్ శ్రీలత అనిల్ కుమార్ సోమవారం ఇరిగేషన్ డీఈఈ ఉషారాణికి వినతిపత్రం సమర్పించారు. ఉమర్‌ఖాన్‌గూడ చెరువు కట్ట తెగిపోయి ఏండ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. పై ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి గ్రామంలోని ఐదు చెరువుల కట్టలు తెగిపోయాయని తెలిపారు. రానున్న వర్షాకాలం లోపల చెరువులకు మరమ్మతులు చేయించి కట్టలను పునర్నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటి కౌన్సిలర్ పొట్టి రాములు, కొహెడా మాజీ సర్పంచ్ అర్జున్‌గౌడ్, నాయకులు అజయ్‌గౌడ్, వేణురెడ్డి, శివకుమార్, వెంకటేష్, రాము, వైభవ్ పాల్గొన్నారు.



బాధితురాలు మాధవికి నగదు, వస్త్రాలను అందజేస్తున్న సురక్ష సంఘం అధ్యక్షుడు గోపిశంకర్‌యాదవ్ తదితరులు

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సహాయం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలు మాధవికి సురక్ష సేవా సంఘం ఆసరాగా నిలిచింది. ఈ మేరకు సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపిశంకర్‌యాదవ్ సంఘ సభ్యుల ద్వారా సేకరించిన రూ. 5 వేల నగదును ఆమెకు అందించారు. అదే విధంగా కట్టుకోవడానికి కొత్త వస్త్రాలను కొనుగోలు చేసి బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, ఎండీ అన్ను, యాకుబ్, పౌల్, డేవిడ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి

రేపు పాతబస్తీలో బీజేపీ విజయసంకల్ప యాత్ర

సైదాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ విజయ సంకల్ప యాత్ర బుధవారం పాతబస్తీలోని శాలిబండా దూద్‌బౌలికి చేరుకుంటుందని భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సైదాబాద్‌లో యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ యాత్ర పాతబస్తీలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల గుండా కొనసాగనుందని వివరించారు. ఈ సందర్భంగా లాల్ దర్వాజ టెంపుల్, చత్రినాకా, గౌలిపురా, ఐఎస్‌సదన్ చౌరస్తా, మలక్‌పేటలలో భారీ బహిరంగ సభలు ఉంటాయని చెప్పారు. ఈ యాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రులు పాల్గొనున్నారని తెలిపారు.

మీర్‌పేట్ టీపీవో కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు

- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికుల ధ్వజం
- నందిహిల్స్ రహదారిపై ధర్నా



నందిహిల్స్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న స్థానికులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లో అక్రమ నిర్మాణాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. మీర్‌పేట్ టీపీవో దేవానంద్ నిర్మాణదారులతో కుమ్మక్కై, వారికి తెర వెనుక అండగా ఉంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై కన్నెర్రజేసిన స్థానిక కాలనీలవాసులు ఆదివారం రాత్రి నందిహిల్స్ రహదారిపై ఆందోళనకు దిగారు. కార్పొరేషన్ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయి ఐదేళ్లు కావస్తున్నా నేటికీ ఇక్కడ గ్రామ పంచాయతీ అనుమతులతోనే నిర్మాణాలు వెలుస్తున్నాయని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి దేవానంద్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది సైతం అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకాస్తున్నారని వారు ధ్వజమెత్తారు. నందిహిల్స్-బీఎన్‌రెడ్డినగర్ రహదారిలో ప్రమాదకర మూల మలుపు వద్ద మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న బహుళ అంతస్తుల భవనం నిర్మాణంపై తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీనికి నిరసనగా నందిహిల్స్, చైతన్యహిల్స్, నాగార్జునహిల్స్, టీచర్స్ కాలనీ, విజ్ఞాన్‌పురికాలనీ, ప్రశాంతిహిల్స్, శివాహిల్స్, సెవెన్‌హిల్స్ తదితర కాలనీలకు చెందిన అనేక మంది సదరు కట్టడం వద్దకు వచ్చి పెద్ద ఎత్తున ధర్నా చేశారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అన్ని అక్రమ నిర్మాణాలకు టీపీవోనే కారణమని, ఉన్నతాధికారుల పేరు చెప్పుకుని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నాడని ఆందోళనకారులు ఆరోపించారు. నందిహిల్స్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణంతో పాటు కార్పొరేషన్ వ్యాప్తంగా జరుగుతున్న అన్ని అక్రమ నిర్మాణాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని వారు స్పష్టం చేశారు.

శ్మశానవాటికలో వసతులు కల్పించాలి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ ప్రగతినగర్ కాలనీలో గల శ్మశానవాటికలో కనీస వసతులు లేనందున అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ దృష్ట్యా అక్కడ కనీస వసతులు కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు, కార్పొరేటర్లు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం బీజేపీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు పద్మా నర్సింహాయాదవ్, భిక్షపతిచారి, హరినాథ్‌రెడ్డి, భీమ్‌రాజ్, జమునాకృష్ణారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు సోమేశ్వర్, మధు తదితరులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికులకు పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని, అదే విధంగా కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం యూనియన్ ప్రతినిధులు సీఐటీయూ నేతలతో కలిసి కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, వారికి వేతనాలు సకాలంలో ఇవ్వకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్, ప్రకాశ్‌కారత్, బాబు, యాదయ్య ప్రకాశ్‌రెడ్డి, యాదగిరిచారి, ధనుంజయ పాల్గొన్నారు.



పతకాలను సాధించిన పోలీసులను అభినందిస్తున్న కమిషనర్ అవినాష్

ఆలిండియా పోలీస్ మీట్‌లో.. సైబరాబాద్‌కు మూడు పతకాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన 67వ ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ సిబ్బందికి 3 పతకాలు లభించాయి. పోలీస్ ఫొటోగ్రఫీలో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఎం.దేవేంద్ర ప్రసాద్‌కు గోల్డ్‌మెడల్ లభించింది. గ్రౌండ్‌సెర్చ్‌లో భాగంగా బాంబు డిస్పోజబుల్ టీమ్‌కు చెందిన జి.రామకృష్ణారెడ్డి గోల్డ్‌మెడల్ సాధించారు. మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఎన్‌వి.రమణ ఫొటోగ్రఫీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. విజేతలను సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి అభినందించారు.

నగరానికి రుత్విక్ రాజన్ మృతదేహం

తిరుమలగిరి ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ పూర్తి చేసేందుకు అమెరికా వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌తో వారం రోజుల క్రితం మృతి చెందిన ఓ యువకుడి మృతదేహం సోమవారం నగరానికి చేరుకుంది. సికింద్రాబాద్‌లోని తిరుమలగిరికి చెందిన తులసీరాజన్- మాధవిల కుమారుడు రుత్విక్ రాజన్(30) రెండేళ్ల క్రితం అమెరికాలో ఎంఎస్ చేసేందుకు వెళ్లాడు. టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉంటూ స్నేహితులతో కలిసి డెన్వర్‌లో ఉంటున్నాడు. గత సోమవారం స్నేహితులతో కలిసి ఓ హోటల్‌లో భోజనం చేస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలడంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌లో బ్లడ్‌క్లాట్ అయిన నేపథ్యంలో వైద్యులు శస్త్ర చికిత్స చేసి 12గంటలపాటు అబ్జర్వేషన్‌లో ఉంచారు. అయితే, 8 గంటలు గడిచేలోపే రుత్విక్ రాజన్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. రుత్విక్ మృతదేహం సోమవారం తిరుమలగిరిలోని ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. రుత్విక్ మృతదేహానికి ఎల్బీనగర్ డీసీపి మురళీ, పలువురు స్థానికులు నివాళులర్పించి కన్నీటి వీడ్కోలు పలికారు. తిరుమలగిరిలోని స్వర్గవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

నర్సింగ్ విద్యార్థులకు నిబంధనలు సరళతరం

- పశ్చిమ ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి అంబర్ జడే సాండర్సన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో హెల్త్‌కేర్ ప్రొఫెషనల్‌గా నమోదు చేసుకోవడం, ఉపాధి పొందడం అంత సులభం కాదని, అయితే భారత్, తెలంగాణ ప్రభుత్వ చొరవతో కఠినతరంగా ఉన్న నిబంధనలను ఆస్ట్రేలియా సరళతరం చేయనున్నట్లు పశ్చిమ ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి అంబర్ జడే సాండర్సన్ తెలిపారు. తన భారత పర్యటనలో భాగంగా సోమవారం నిమ్స్‌లో జరిగిన ఆరోగ్య శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత్ నర్సింగ్ విద్యార్థులు తమ ఉన్నత విద్య, స్పెషలైజేషన్ కోసం ఆస్ట్రేలియాలో ప్రత్యేక నర్సింగ్ విశ్వ విద్యాలయాల్లో చేరవచ్చని తెలిపారు. భారత్‌తో పరస్పర అవగాహన, విజ్ఞానం, అనుభావాలు ఒకరికొకరం పంచుకోవడంలో పశ్చిమ ఆస్ట్రేలియా సిద్ధమని తెలిపారు. ఆస్ట్రేలియాలో వైద్యులు, నర్సింగ్, వైద్య అనుబంధ సాంకేతిక నిపుణులకు విస్తారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సింపోజియంలో మొదట నిమ్స్ సంచాలకులు డాక్టర్ నగరి బీరప్ప సంస్థలో ఉన్న వివిధ విభాగాలు, అందజేస్తున్న వివిధ కోర్సులు, సాధించిన విజయాలు, సాంకేతిక వ్యవస్థ, వైద్య ఆచార్యులు, ఇతర నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, భవిష్యత్ ప్రణాళికల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రభుత్వ ప్రతినిధులు స్టేసీ హేర్స్, జోడీ సౌత్, పార్లమెంట్ సెక్రెటరీ డాక్టర్ జగదీష్ కృష్ణన్, మేనేజింగ్ డైరెక్టర్ రామచంద్రన్, తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

డయాలసిస్ సేవల పరిశీలన..

ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి గౌరవ అంబర్ జడే సాండర్సన్ నిమ్స్ డయాలసిస్ విభాగాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. రాష్ట్రంలో వందకు పైగా డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుబంధంగా చేసి నిమ్స్ ప్రధాన కేంద్రంగా రోగులకు సేవలు అందిస్తున్న తీరుని డాక్టర్ గంగాధర్ వివరించారు.



పాటల ద్వారా పథకాలపై అవగాహన కల్పిస్తున్న సాంస్కృతిక సారథి కళా బృందం

ఆరు గ్యారంటీలపై అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అభయ హస్తం-ప్రజాపాలన ఆరు గ్యారంటీలు, పరిసరాల పరిశుభ్రత అంశాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం ఆధ్వర్యంలో సోమవారం పసుమాములలో వార్డు కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాటల రూపంలో ఆరు గ్యారంటీల పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు యాదయ్య, విద్యానందాచారి, కిష్టయ్య, మోహన్, రాజు, దుర్గాప్రసాద్, రాజు, సునీత, మౌనిక, యాదయ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై రాయితీ ఇవ్వండి

- సర్కారుకు జీహెచ్ఎంసీ లేఖ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై రాయితీ కల్పించాలని కోరుతూ జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భారీగా పేరుకుపోయిన బకాయిల వసూలు ద్వారా ఆదాయం పొందవచ్చని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రేటర్‌లో 18.93 లక్షల ఆస్తిపన్ను చెల్లింపుదారులున్నారు. వీరిలో 30శాతం మంది ప్రతి యేటా పన్ను చెల్లించడం లేదు. గ్రేటర్‌లో ప్రస్తుతం రూ.8వేల కోట్ల వరకు ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. ఇందులో రూ.5 వేల కోట్లు అసలు పన్ను కాగా.. రూ.3 వేల కోట్లు వడ్డీ. వడ్డీపై రాయితీ ప్రకటించిన నేపథ్యంలో అసలులో కొంతయినా వసూలవుతుందని బల్దియా రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వడ్డీపై 90 శాతం రాయితీ కల్పిస్తూ రెండు దఫాలుగా వన్ టైం స్కీమ్(ఓటీఎస్) ప్రకటించారు. దీంతో రూ.575 కోట్ల పన్ను వసూలైంది. ప్రస్తుతం అప్పులకు వాయిదాలు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దీనస్థితి ఉన్న నేపథ్యంలో మరోసారి వడ్డీపై రాయితీ కల్పించడం ద్వారా ఆదాయం మెరుగుపర్చుకోవాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. నెల రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా సర్కారు నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని ఓ అధికారి తెలిపారు. ఇదిలా ఉంటే రూ.5 వేల కోట్ల పన్ను బకాయిల్లో రూ.3 వేల కోట్లకుపైగా ప్రభుత్వ ఆస్తుల నుంచి రావాల్సి ఉంది.

మార్చి 3న పల్స్ పోలియో..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మార్చి 3న నిర్వహిస్తున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 0-5 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. బూత్ ఆక్టివిటీ మార్చి 4, 5, 6 తేదీల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ శ్రీకళ, అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి జయమాలిని, డీఈఓ రోహిణి, సీనియర్ సర్వేలైన్స్ మెడికల్ ఆఫీసర్ మురారీ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ పోస్టర్..


ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ పోస్టర్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం జీఎం సుబ్రహ్మణ్యం, ఏఎల్‌డీఎం ప్రదీప్‌సింగ్, వివిధ బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

పంజాగుట్ట పీఎస్ నుంచి పారిపోయిన దొంగ అరెస్ట్

పంజాగుట్ట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ నుంచి పారిపోయిన దొంగను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇటీవల ఎర్రమంజిల్ చౌరస్తా నుంచి తాజ్ డెక్కన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో ఈనెల 21న అర్ధరాత్రి వేళ చోరీకి ప్రయతించిన ఓ దొంగను స్థానికులు పట్టుకుని పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు. అతన్ని విచారించగా వరంగల్ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన కె.శివ(22)గా గుర్తించారు. అయితే, అర్ధరాత్రి కావడంతో పోలీస్‌స్టేషన్‌లోనే ఓ మూలన అతన్ని కూర్చోబెట్టారు. 22న తెల్లవారుజామున పోలీసుల కళ్లు గప్పి అతను పారిపోయాడు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో అతన్ని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు అతను సోమవారం నిలోఫర్ ఆస్పత్రి వద్ద పోలీసులకు పట్టుబడగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

తాగునీటి పైపులైన్ పనులను పూర్తి చేయాలి

చంపాపేట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని పోచమ్మగడ్డబస్తీ, మారుతీనగర్‌కాలనీలో సోమవారం కార్పొరేటర్ మధుసూధన్‌రెడ్డి జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పైపులైన్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మారుతీనగర్‌కాలనీ అధ్యక్షుడు రమేష్, మాజీ అధ్యక్షులు రఘునందన్‌రెడ్డి, కాలనీప్రతినిధులు పాల్గొన్నారు.



అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా యాకుత్‌పురా రైల్వే స్టేషన్‌లో రూ.8.44 కోట్లతో చేపట్టనున్న అధునికీకరణ పనులను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్ బాబు, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

- సైదాబాద్,ఆంధ్రజ్యోతి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

రాజకీయాలకు అతీతంగా పాతబస్తీ అభివృద్ధి

సైదాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా పాతబస్తీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్‌లోని ప్రెస్‌కాలనీ, బాలాజీనగర్‌లో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్, కార్పొరేటర్ శ్వేతారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్‌కాలనీలో గల మనోరమా ఐటీఐ లేన్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి సోమవారం ప్రారంభించారు. రూ.15లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు ఆమె వివరించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు యాదగిరి సురేందర్, నాయకులు సందీప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నందు, అశోక్ సంతోష్ పాల్గొన్నారు.



తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులైన సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై.కర్ణాకర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు

-వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

బైక్‌పై విద్యార్థినిని తీసుకెళ్తున్న విద్యార్థిపై దాడి

- పోలీసుల అదుపులో నలుగురు

చాదర్‌ఘాట్. ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థినిని బైక్‌పై తీసుకెళ్తున్న ఇంటర్ విద్యార్థిని ఆరుగురు వెంబడించి మూకుమ్మడిగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఓ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థి తన తోటి విద్యార్థినిని బైక్‌పై మలక్‌పేట సోహెల్ హోటల్ రోడ్‌లో తీసుకెళ్తున్నాడు. రెండు బైక్‌లపై వెంబడించిన ఆరుగురు టీనేజర్లు విద్యార్థిపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఎందుకు దాడి చేస్తున్నారని అతడు ప్రశ్నిస్తున్నా పట్టించుకోకుండా పిడిగుద్దులు గుద్దడంతో వారి బారి నుంచి తప్పించుకొని పారిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో చాదర్‌ఘాట్ పోలీసులు దాడికి కారకులైన ఆరుగురిలో నలుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. బాధితుడిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అశ్విని ఆంజనేయులుకు సేవారత్న పురస్కారాన్ని అందజేస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రయ్య, తదితరులు

అశ్విని ఆంజనేయులు చేస్తున్న సేవలు అభినందనీయం

వనస్థలిపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అణగారిన వర్గాల శ్రేయస్సుకు కర్పూరి ఠాకూర్ సామాజిక సేవాసమితి అధ్యక్షులు అశ్విని ఆంజనేయులు చేస్తున్న సేవలు అభినందనీయమని హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రయ్య అన్నారు. సోమవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సరస్వతి పరిషత్ కళా మందిర్‌లో హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రయ్య చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకమైన సేవారత్న పురస్కారాన్ని వనస్థలిపురానికి చెందిన అశ్విని ఆంజనేయులుకు అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ.. అశ్విని ఆంజనేయులు తన వంతుగా సమాజంలోని అనాథలు, వృద్ధులు, అణగారిన వర్గాల ప్రజలకు ఉచితంగా హేర్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ హైకోర్టు మాజీ జస్టిస్ పీ.ఎస్ నారాయణ, సెన్సార్ బోర్డు సభ్యులు పి.కృష్ణాధిశేషు, ఎస్.పి.భారతి, దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.

గుడికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



హరికృష్ణ

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బీరప్ప గుడికి వెళ్లోస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తారామతిపేట ప్రియదర్శినికాలనీకి చెందిన హరికృష్ణ(36) ఈ నెల 22న మధ్యాహ్నం తన ఇంటి సమీపంలోని బీరప్ప గుడికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా దొరకలేదు. దీంతో అతడి భార్య హేమలత సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హరికృష్ణకు మతిస్థిమితం సరిగా లేదని, 20 రోజుల క్రితం ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స కూడా చేయించినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబ్ వీడియోలతో ప్రభావితం చేసి రూ. కోట్లు కొల్లగొట్టిన ఘనుడు..

- నిందితుడిని అదుపులోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే.. అతి తక్కువ సమయంలోనే రూ. కోట్లు సంపాదించొచ్చు అంటూ.. యూ ట్యూబ్‌లో వీడియోలు చేస్తూ.. వందలమందిని ప్రభావితం చేసి రూ. కోట్లు కొల్లగొట్టిన మోసగాడిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శివకుమార్ అనే వ్యక్తి ఓ యూ ట్యూబ్ చానల్ నిర్వహిస్తూ.. రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, లాభాల గురించి వీడియోలు చేసి పోస్టుచేస్తూ వందల సంఖ్యలో ఫాలోవర్స్‌ను సంపాదించుకున్నాడు. ఎక్కడ పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయనే విషయాలు విశదీకరిస్తూ ఆకట్టుకునేవాడు. ఆ వీడియోలు చూసిన చాలా మంది అతడి మాటలకు ప్రభావితులై నేరుగా సంప్రదించి రూ. కోట్లలో పెట్టుబడి పెట్టారు. ఇదే మంచి అవకాశంగా భావించిన శివకుమార్ పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారి నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టి రిటర్న్స్ ఇవ్వకుండా ఉడాయించాడు. విషయం తెలుసుకున్న బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని గుర్తించి మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించిన క్రమంలో.. అతడి మాయలో పడి పదుల సంఖ్యలో బాధితులు మోసపోయి రూ. కోట్లలో సమర్పించుకున్నట్లు తెలిసింది. కొల్లగొట్టిన డబ్బు నిందితుడు ఏం చేశాడు..? ఎక్కడ పెట్టాడు..? అనే విషయమై సీసీఎస్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.